తీన్మార్ మల్లన్నకు అభినందనల వెల్లువ



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన కాంగ్రెస్ నేతలు

కీసర: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బుధవారం కాంగ్రెస్ పార్టీ కీసర మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, చర్లపల్లి కృష్ణారెడ్డి, పోచబోయిన రాజుయాదవ్, మచ్చాని శ్రీశైలంయాదవ్, రాగుల కిషోర్, మేడ్చల్ జిల్లా తీన్మార్ మల్లన్న టీమ్ అధ్యక్షుడు గణేష్(కీసర)లు ఉప్పల్‌లోని క్యూన్యూస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మరమ్మతులు ప్రారంభం



ఘట్‌కేసర్‌లో మరమ్మతులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మరమ్మతులను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మ, ఎంపీడీఓ గీతారెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సరళకుమార్, రామారావుముదిరాజ్, రవి, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, ఎంపీఓ రవి, ఎంఈఓ శశిధర్, ఏఈ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: భారీ వర్షాల కారణంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ జవాన్లతో ప్రకృతి వైపరీత్యాల విపత్తు నిర్వహణ, భారీ వర్షాల గురించి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా మున్సిపల్ పరిధిలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. 48 రోజుల తర్వాత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులు ఉత్సాహంగా బడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజాం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని, అన్ని సబ్జెక్టుల్లో ఉపాధ్యాయులు కలిగి ఉన్నారన్నారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి వరి ధాన్యంతో అభిషేకం



కీసర: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణస్వీకారం చేసిన మొదటి రోజే రైతుల ఖాతాల్లో నేరుగా సుమారు రూ.20 వేల కోట్లు జమ చేయాలని సంతకం చేసిన సందర్భంగా పార్టీ కీసర మండల, బీజేకేఎం మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు అబ్రబోయిన నాగరాజు ఆధ్వర్యంలో కీసర చౌరస్తాలో నరేంద్రమోదీ చిత్రపటానికి వరి ధాన్యంతో అభిషేకం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ఏనుగు రాజిరెడ్డి, బోగారం ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ నేతలు రాగుల అశోక్, ఐలయ్యయాదవ్, మెట్టు కృష్ణాయాదవ్, కోల బాల్‌రాజ్‌యాదవ్, వంగేటి బాపిరెడ్డి, పవన్‌గౌడ్, మల్లారెడ్డి, సత్యం, శ్రీనివాస్, ఆంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని అభివృద్ధి పనులపై బుధవారం మల్లాపూర్ వార్డు కార్యాయంలో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ కాప్రా ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు సాఫీగా వెళ్లేందుకు మరోలైన్ వేస్తాం



మల్లాపూర్: వీరారెడ్డి నగర్ కాలనీలో వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులకు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ సూచించారు. బుధవారం వీరారెడ్డినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల పిలుపు మేరకు కార్పొరేటర్ కాలనీలో పర్యటించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్న వర్షానికే వీరారెడ్డి నగర్ కాలనీలో వరద నిలుస్తోందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. నీరు సాఫీగా వెళ్లేందుకు మరోలైన్ కూడా వేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ రూప, నాచారం ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, స్థానిక నేతలు మేకల ముత్యంరెడ్డి, శివకుమార్, గంగాధర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య

మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్



పది ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్

మేడ్చల్‌రూరల్: ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. పాఠశాలల పునర్ ప్రారంభం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు పాఠ్య, నోట్‌బుక్స్, యునిఫామ్స్ అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన లక్ష్మిప్రసన్నకు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాలలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమం జిల్లా విద్యాధికారి విజయకుమారి, డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ, ప్రత్యేకాధికారి రేఖ మేరి, ఎంపీడీఓ వసంతలక్ష్మి, తహసీల్దార్ శైలజ, ఎంఈఓ వసంతలత, పాఠశాల హెచ్ఎం కొండయ్య, వైస్ ఎంపీపీ వెంకటేశ్, కో ఆప్షన్ మెంబర్ రుక్సానా, నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు



ఘట్‌కేసర్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: ప్రభుత్వ పాఠశాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని బాలుర, బాలికల పాఠశాలలో స్థానిక కౌన్సిలర్ నస్రీన్ సుల్తానాతో కలిసి బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సుమారు 50 రోజుల సెలవుల తర్వాత పాఠశాలలు తెరిచారు. విద్యార్థులు సెలవులకు వీడ్కోలు పలుకుతూ స్నేహితులతో కలిసి ఉత్సాహంతో పాఠశాలలో అడుగుపెట్టారు. కార్యక్రమంలో హెచ్ఎం పాపిరెడ్డి, పీడీ వినోద్‌కుమార్, నర్సింగ్‌రావు, సిరాజ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాలల పునఃప్రారంభం

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు బుధవారం పునఃప్రారంభమయ్యాయి. తొలి రోజు పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు అందజేశారు. వేసవి సెలవులు యుగియడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పిల్లల కేరింతలతో పాఠశాలల్లో సందడి వాతావరణం ఏర్పడింది.



అన్నోజిగూడలోని జెడ్పీ హైస్కూల్‌లో పుస్తకాలు తీసుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్, మధ్యాహ్న భోజన వసతి తదితర సౌకర్యాలను కల్పిస్తోందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బడిబాటలో భాగంగా బుధవారం నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన ఉంటుందన్నారు. భోగారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలి



గుండ్లపోచంపల్లి స్కూల్‌లో పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మేడ్చల్/మేడ్చల్‌రూరల్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునర్ ప్రారంభం అయ్యాయి. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు.

పుస్తకాలు అందజేసిన డీఈఓ..

మండలంలోని డబిల్‌పూర్, మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాధికారి విజయకుమారి, ఎంఈఓ వసంతలత సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. డబిల్‌పూర్‌లో ఎంపీపీ రజితరాజమల్లారెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రైవేటుగా ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తారని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందించే ప్రభుత్వ పాఠశాలలోనే తమ చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

పుస్తకాలు పంపిణీ చేసిన నాయకులు..

ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నిర్వహించిన పుస్తకాలు, యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని విద్యార్థులు అందజేశారు. గుండ్లపోచంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు సాయిపేట శ్రీనివాస్, హేమంత్‌రెడ్డి, బాలరాజ్, జైపాల్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. అత్వెల్లి పాఠశాలలో మేడ్చల్ మున్సిపల్ కౌన్సిలర్లు సరితామల్లేశ్‌గౌడ్, మానస శ్రవణ్‌గుప్తా, జాకట దేవరాజ్ ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు పుస్తకాలు, యూనిఫాం అందజేశారు.



అత్వెల్లి పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్లు



డబిల్‌పూర్ స్కూల్‌లో యూనిఫాం అందజేస్తున్న డీఈఓ, ఎంపీపీ

రెవెన్యూ రికార్డుల గదిని ప్రారంభించిన కలెక్టర్



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ రికార్డు గదిని బుధవారం జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రికార్డు రూమ్‌లో రెవెన్యూ సెక్షన్లకు సంబంధించిన ఫైల్స్‌తో సహా వివిధ రకాల రికార్డు పుస్తకాలు భద్రపరచడం జరుగుతుందన్నారు. ఏబీసీడీఈఎఫ్ అండ్ జీ, లా ఆఫీస్, ఎస్‌డీసీఎల్‌ఏ, యూఎల్‌సీ తదితర అన్ని విభాగాలకు సంబంధించిన రికార్డులు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్, రెవెన్యూ శాఖలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ధరణిపై ప్రత్యేక నజర్

- నిర్లక్ష్యం వహించిన ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు
- వారిపై కొనసాగుతున్న శాఖ పరమైన విచారణ
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2 వేలకు పైగా దరఖాస్తుల పెండింగ్
- ఇందులో కొత్తగా వచ్చిన దరఖాస్తులు 1,102



సాక్షి, మేడ్చల్ జిల్లా: 'ధరణి వినతుల పరిష్కార ప్రక్రియ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే కంప్యూటర్ ఆపరేటర్ల నిర్లక్ష్యంతో.. కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాల్లో ధరణి దరఖాస్తుల పరిశీలన జాప్యమవుతోంది. దీన్ని పసిగట్టిన జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఔట్ సోర్సింగ్‌పై కుత్బుల్లాపూర్, అల్వాల్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లను విధుల నుంచి తొలగించింది. అలాగే, వారిపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై శాఖపరమైన విచారణ నిర్వహిస్తున్నారు. ఈ విచారణలో వారి తప్పిదనం ఏమీ లేదని తేలినట్లయితే.. మళ్లీ విధుల్లోకి తీసుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

ధరణి దరఖాస్తుల పరిశీలనలో..

ధరణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినప్పటికీ, పరిష్కారానికి నోచుకోవడం లేదు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ధరణికి సంబంధించిన దరఖాస్తులు 2 వేలకుపైగా ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ధరణి దరఖాస్తుల పరిశీలనకు 21 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినా నత్తనడక కొనసాగుతోంది. దీనికి ప్రధాన కారణం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో రెవెన్యూ యంత్రాంగం మునిగిపోయి ఉండటమని.. ఆ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, గ్రామస్థాయిలో భూముల వివాద పరిష్కారాల్లో చురుగ్గా ఉండే వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దు కావడం వల్ల క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లిన మండల ప్రత్యేక బృందాలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొన్ని తహసీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తుల పంపిణీలో జాప్యం నెలకొనగా.. రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఎన్నికల ముందు కొంత మంది అధికారులు బదిలీ కావడంతో కొంత అయోమయం నెలకొంది. జిల్లాల్లో గతేడాది డిసెంబరు ఆఖరు నాటికి తొమ్మిది వేలకుపైగా ఫిర్యాదులు నమోదు కాగా.. జనవరి, ఫిబ్రవరిల్లో మరో 1,102 పైగా దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో దాదాపు 2 వేల దరఖాస్తులు మినహాయించి మిగతా వాటిని పరిష్కరించినట్లు తెలుస్తోంది. అయితే.. పట్టాదారు పాసు పుస్తకాల్లో పేర్లు, ఆధార్ నంబరు, ఫోన్ నంబర్ల మార్పు తదితర వాటిని తహసీల్దార్ పరిధిలోనే పరిష్కారం లభించే విధంగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయటంతో సులభమైనట్లు తెలుస్తోంది. అయితే.. కొన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో పరిష్కారం జాప్యంగా జరుగుతుందని పేర్కొంటున్నాయి.

రికార్డులు లేక..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పలు మండలాల్లో వివాదంలో ఉన్న రెవెన్యూ, ఇతర భూములపై కూడా దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిశీలించే క్రమంలో పాత రికార్డులను వెతకగా.. కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో ఇవి అందుబాటులో లేవని తెలుస్తోంది. కొన్నిచోట్ల మాన్యువల్ పహాణీలు అందుబాటులో లేకపోవడంతో ప్రత్యేక బృందాలకు దరఖాస్తుల పరిష్కారంలో ఇక్కట్లు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.

స్వచ్ఛంద కార్యక్రమాలపై అవగాహన అవసరం

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాలపై తగినంత అవగాహన అవసరమని ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు స్పష్టం చేశారు. నగరానికి చెందిన టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ(టీఐఏ) ఆధ్వర్యంలో ప్రముఖ ఎన్జీఓ సంస్థ రుబురూ నిర్వహించిన షేర్ లెర్నింగ్ ఎక్స్ఛేంజ్ ఈవెంట్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్జీఓ సంస్థల కార్యకలాపాల్లో విద్యార్థులు భాగం పంచుకోవడం ఎంత అవసరమో వివరించారు. మొత్తం 3 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో జట్టు కట్టడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, స్టెమ్ సైన్స్ టెక్నాలజీ.. తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు.

నాలాలో పూడికతీత పనుల పరిశీలన



పోచారం: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్నోజిగూడలోని నాలాలో పూడికతీత పనులను మున్సిపల్ సిబ్బంది బుధవారం చేపట్టారు. పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా నాలాల్లోని చెత్తాచెదారాలను తొలగిస్తున్నట్లు చెప్పారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



శామీర్‌పేట్: తనతో చదువుకున్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు తోటి స్నేహితులు. వివరాలు.. శామీర్‌పేట మండలం, యడారం గ్రామానికి చెందిన సత్యనారాయణ శామీర్‌పేటలోని 1999 – 2000 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుకున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యనారాయణ గత నెలలో మృతి చెందాడు. దీంతో అతడితో పాటు చదువుకున్న స్నేహితులంతా ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. బుధవారం రూ.50 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధుకృష్ణ

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన క్యాతం మధుకృష్ణ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా.. లక్ష్మాపూర్ గ్రామ నక్ష, రెవెన్యూ సమస్య వల్ల 7 సంవత్సరాలుగా రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎంకు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన పట్టా పాసుపుస్తకాల్లో జరిగిన అవకతవకలపై, అక్రమ రిజిస్ట్రేషన్లపై సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని లక్ష్మాపూర్ రోడ్డుకు ఎంసీపల్లి మండల శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన భూమి ఉందని, మండల కేంద్రం పేరును లక్ష్మాపూర్–ఎంసీపల్లిగా మార్చాలని వినతి పత్రం ఇచ్చినట్లుగాయన తెలిపారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ జిల్లా యంత్రాంగంతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు,

భూమండల్ ఎరువుతో దిగుబడి



లియోనియాలో భూ మండల్‌ను లాంచ్ చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

శామీర్‌పేట్: రైతులకు అత్యాధునిక పరిష్కార మార్గాలను చూపుతున్న ఏకైక ఎరువుల కంపెనీ తమదేనని ఆ సంస్థ సీఈఓ సీఎస్ఆర్ నాయుడు అన్నారు. వారి కంపెనీలో తయారు చేసిన బుధవారం మేడ్చల్ జిల్లా లియోనియా రిసార్ట్స్‌లో మునారా ఆగ్రో టెక్నాలజీస్ ప్రైవేట్ కంపెనీలో తయారు చేసిన భూ మండల్ ఉత్పత్తిని మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ నేలల్లో సేంద్రీయ కర్బనం తక్కువగా ఉండటం వల్ల సూక్ష్మజీవులు తక్కువగా ఉన్నాయని, తద్వారా పంట దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకే దేశంలోనే మొట్టమొదటి సారిగా పులియబెట్టిన సేంద్రీయమైన భూ మండల్‌ను రైతులకు అందజేస్తున్నామని వివరించారు. ఈ ఎరువును ఎకరాకు నాలుగు నుంచి ఐదు బ్యాగులు వాడితే మట్టిలో భూసారం పెరిగి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నర్మద బయోకెమ్ లిమిటెడ్ డైరెక్టర్ హిమాలయ పటేల్, డీలర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మర్పల్లిగూడలో కార్మికుల నిరసనకు సంఘీభావం తెలుపుతున్న సబిత

ఘట్‌కేసర్: ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని మర్పల్లిగూడ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఆ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి సబిత గ్రామానికి వెళ్లి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల నిరసనకు సంఘీభావం తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు దానయ్య, బుచ్చయ్య, చిన్న దానయ్య, రాంచందర్, లక్ష్మి, పద్మ, సురేశ్, సత్తయ్య, శ్రీనివాస్, బాలరాజ్, నరసింహ, వీరమ్మ, లక్ష్మణ్, బాలకృష్ణ, సత్యనారాయణ, జయమ్మ, శేఖర్, కవిత, జంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



జవహర్‌నగర్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ అన్నారు. జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను బుధవారం రెవెన్యూ సిబ్బందిచే కూల్చివేయించి ప్రభుత సూచిక బోర్డు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాసీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.